నమస్తే తెలంగాణ
ములుగు జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, మంగళవారం 17 డిసెంబర్ 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

మడికొండలో సోమవారం రాత్రి కమ్ముకున్న పొగమంచు





నర్సాపురం వాగులో గుర్తించిన పులి పాదముద్రలు

మహదేవపూర్ : చలిమంట వేసుకున్న ప్రజలు

# గజగజ

## ఇటు చలి.. అటు పులి

- ఇగంతో వణుకుతున్న జనం
- కనిష్ఠ స్థాయికి పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- చలితో పెరుగుతున్న సీజనల్ వ్యాధులు

మహదేవపూర్/వాజేడు/తాడ్వాయి, డిసెంబర్ 16 : చలి పులి గజగజ వణికస్తున్నది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతుండగా సోమవారం 12 డిగ్రీలుగా నమోదైంది. ముఖ్యంగా ఏజెన్సీలో చలి పంజా విసురుతుండగా పులి సంచారం కలవరపెడుతున్నది. ఉదయం నుంచే మంచు కమ్ముకోవడంతో పొద్దెక్కినా బయటకు వచ్చేందుకు ప్రజలు వెనుకంజ వేస్తున్నారు. ఇక రాత్రివేళలో చలికి తట్టుకోలేక స్వెట్టర్లు, మాస్కులు, మఫ్లర్లు ధరించినా తగ్గ కపోవడంతో చలిమంట కాగుతూ ఉపశమనం పొందుతున్నారు. కాగా చలి తీవ్రత కారణంగా చిన్నారులు, పెద్దలు జలుబు, శ్వాససంబంధ సమస్యలతో పాటు జ్వరంతో ఇబ్బంది పడుతున్న క్రమంలో తగు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

*తాడ్వాయిలో పెద్దపులి ప్రత్యక్షం..*

తాడ్వాయి మండలంలోని నర్సాపురం సమీపంలోని కట్ నర్సాపురం వాగులో పులి సంచరించిన ఆనవాళ్లు లభించాయి. గ్రామస్తుల సమాచారం మేరకు అటవీశాఖ రేంజ్ అధికారి కోట సత్తయ్య వాగు వద్దకు వెళ్లి పాదముద్రలను పరిశీలించి పులివేనని నిర్ధారించారు. ఇతర జిల్లాలకు పులి వెళ్లిందని భావించినా తాడ్వాయి అడవుల్లోనే సంచరిస్తున్నదని తెలిపారు. వాగులో నుంచి పులి లింగాల ప్రాంతం నుంచి ఖమ్మం జిల్లాకు వెళ్లే అవకాశం ఉందని తెలిపారు. గ్రామానికి అతి సమీపంలోని వాగులో పులి పాదముద్రలు ఉండడంతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు.

## కేటీఆర్‌ను కలిసిన సిరికొండ, బీఆర్ఎస్ యూత్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారితో వెళ్లి జయశంకర్ భూపాలపల్లి బీఆర్ఎస్ యూత్ నేతలు కలిశారు. వారిలో బీఆర్ఎస్ యూత్ సీనియర్ నాయకులు బియ్యాని పూర్ణచందర్, వజినపల్లి మాజీ సర్పంచ్ తాళ్లపల్లి స్వామి, ముద్దసాని కిరణ్, గుజ్జేటి రమేశ్ ఉన్నారు. –కృష్ణ కాలనీ, డిసెంబర్ 16



- ఆరోగ్య శాఖ అంతర్గత విచారణలో నిజమేనని నిర్ధారణ
- చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర కమిషనర్‌కు ప్రతిపాదన
- అక్రమార్కుడికి అండగా నిలిచి అడ్డుకుంటున్న ఓ మంత్రి
- పొలిటికల్ ఎంట్రీతో పెండింగ్ పెట్టిన ఉన్నతాధికారులు
- తూతూమంత్రంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగిపై వేటు

# అవినీతి అధికారికి రాజకీయ రక్షణ..!

వెలుగులోకి హనుమకొండ వైద్య శాఖ ఉన్నతాధికారి అక్రమాలు

**ఓ అవినీతి అధికారికి** పొలిటికల్ పలుకుబడి రక్షణగా నిలుస్తున్నది. అతడు అక్రమాలకు పాల్పడింది నిజమేనని తేలినా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా అడ్డుకుంటున్నది. ఫలితంగా కోట్లల్లో నిధులు దుర్వినియోగం చేసి, పాలనా పరంగా తప్పుడు నిర్ణయాలు తీసుకున్న సదరు అధికారి జంకు, బొంకు లేకుండా దర్జాగా తిరుగుతున్నాడు. హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారి ఏడాదిగా ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగితో కలిసి నిధులను పక్కదారి పట్టించాడు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీలోనూ అక్రమాలకు తెగబడ్డాడు. నిధుల ఖర్చుకు సంబంధించిన లెక్కలు ఆడిట్ శాఖ తనిఖీల్లోనూ చిక్కకపోవడంతో ఆరోగ్య శాఖ ఆలస్యంగానైనా చర్యలకు ఉపక్రమించింది. తొలుత ఔట్ సోర్సింగ్ ఉద్యోగిపై వేటు వేసింది. అధికారి అక్రమాలపై అంతర్గతంగా విచారణ జరిపి అవి నిజమేనంటూ నిర్ధారించి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కమిషనర్‌కు నివేదించింది. దీంతో సదరు అధికారి ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఓ మంత్రిని ఆశ్రయించగా, అంతా అతడికి కలిసి వచ్చింది. మంత్రి ఎంట్రీతో ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకుండా మీన మేషాలు లెక్కిస్తుండడంతో ప్రస్తుతం ఆ ఫైల్ పక్కన పడింది.

- వరంగల్, డిసెంబరు 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్య ఉప కేంద్రాలను అభివృద్ధి చేసింది. కేంద్ర ప్రభుత్వ విధానం ప్రకారం ఈ కేంద్రాలు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లుగా మారాయి. కేంద్రాల మరమ్మతులు, ఆధునీకరణ, అత్యవసర మందుల కొనుగోలు కోసం రాష్ట్ర ప్రభుత్వం తొలిదశలో రూ. 93 లక్షలు విడుదల చేసింది. వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా కీలక అధికారి, మరో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి కలిసి ఈ నిధులను పక్కదారి పట్టించారు. నిబంధనలకు విరుద్ధంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అకౌంట్‌లోకి మార్చారు. ఆ తర్వాత నిధుల వినియోగంపై ఎలాంటి లెక్కలు లేవు. ప్రభుత్వ ఆడిట్ శాఖ తనిఖీల్లో నిధులు ఖర్చు చేసినట్లు ఎక్కడా ఆధారాలు దొరకలేదు. ప్రభుత్వ పరంగా ఈ విషయమై చర్యలు తీసుకునేందుకు సిద్ధం కావడంతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని తొలగించారు. అవినీతి ఆరోపణలపై వైద్య, ఆరోగ్య శాఖ అంతర్గతంగా విచారణ జరిపి నిజమేనని నిర్ధారించి అధికారిపై చర్యలకు ప్రతిపాదనలు రాష్ట్ర కమిషనర్‌కు నివేదిక పంపించింది. దీంతో సదరు అధికారి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఓ మంత్రి దగ్గరికి వెళ్లి అండదండలు కావాలని కోరాడు. ఆ మంత్రి సూచనతో కమిషనర్ కార్యాలయం అతడిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా పెండింగ్‌లో పెట్టింది.

### పోస్టులను అమ్ముకున్నారు...

వైద్య సేవల కల్పన, మందుల కొనుగోలులో అక్రమాలకు పాల్పడిన అధికారి ఉద్యోగాల భర్తీలోనూ ఇదే రకంగా వ్యవహరించారు. వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా కార్యాలయంలో గతంలో పని చేసిన మరో అధికారితో కలిసి ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీలో అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు వ్యక్తమయ్యాయి. జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవల కోసం మంజూరైన వాటిలో 81 పోస్టులను అమ్ముకున్నట్లు తెలిసింది. ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే అర్బన్ హెల్త్ సెంటర్, పల్లె దవాఖానాల్లో 63 మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ పోస్టులు, 9 డాక్టర్, స్టాఫ్ నర్సు, సపోర్ట్ స్టాఫ్, 5 సపోర్ట్ ఇంజినీర్, 4 ఫార్మసిస్టు పోస్టులను భర్తీ చేయగా, ఈ అంశంపై సైతం విచారణ జరిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ కార్యాలయానికి జిల్లా కలెక్టర్ నివేదిక పంపారు. అయితే అవినీతి అధికారిపై తీసుకోవాల్సిన చర్యలు తీసుకోవాల్సి ఉండగా, ప్రభుత్వంలోని పెద్దలు అడ్డుపడుతుండడంతో ఉన్నతాధికారులు ఆలోచనలో పడ్డారు.

**పల్లెపోరుకు కసరత్తు మొదలైంది.** షెడ్యూల్ ఎప్పుడొచ్చినా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారం యంత్రాంగం సన్నద్ధమైంది. ఇందులో భాగంగా అన్ని ఏర్పాట్లు చేస్తుండగా ఇప్పటికే గ్రామాలు, వార్డుల వారీగా ఓటరు జాబితాను సిద్ధం చేసింది. ఇటీవల పోలింగ్ కేంద్రాల గుర్తింపును పూర్తిచేసి ముసాయిదా జాబితాను ప్రకటించి అభ్యంతరాలు స్వీకరించింది. నేడు పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను వెల్లడించనున్నది. అలాగే బ్యాలెట్ పేపర్లు ప్రింటింగ్ చేసి సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేయగా ఆమేరకు పీఆర్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పల్లెల్లో ఎన్నికల సందడి మొదలుకాగా, ఆశావహులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలతో మమేకం అవుతుండడంతో రాజకీయం రసవత్తరంగా మారనున్నది. - జనగామ, డిసెంబర్ 16(నమస్తే తెలంగాణ)/హనుమకొండ

## షెడ్యూల్ రాగానే నిర్వహించేందుకు రెడీ

- ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నం
- నేడు తుది పోలింగ్ స్టేషన్ల జాబితా వెల్లడి

హనుమకొండ పంచాయతీరాజ్ కార్యాలయానికి చేరిన ఎన్నికల సామగ్రి

# పల్లె పోరుకు సన్నద్ధం

### గ్రామాల్లో ఎన్నికల సందడి

పంచాయతీరాజ్ చట్టం–2018 ప్రకారం రాష్ట్రంలో పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం 2024 జనవరి 31న ముగిసింది. ఫిబ్రవరి నుంచి గ్రా మ పంచాయతీలు, వార్డులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వివిధ కారణాల వల్ల ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. తాత్కాలికంగా పల్లెల్లో ప్రత్యేక అధికారులను నియమించి వారితో పాలన కొనసాగిస్తోంది. ఈ క్రమంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. ఆయా గ్రామాల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు జరుగునన్న సందర్భంగా ఎన్నికల వేడి రాజుకొంటున్నది. దీంతో గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల వద్దకు ఇప్పటి నుంచి ఆశావహులు చక్కర్లు కొడుతున్నారు. నాయకులను ప్రసన్నం చేసుకొని ఏలాగైన పదవి దక్కించుకోవాలని ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు సైతం ఆశావహులను ఎవరినీ వదులుకోకుండా అందరికీ హామీలు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో గ్రామంలో ఎక్కడ నలుగురు కలిసినా పంచాయతీ ఎన్నికలతో పాటు ప్రభు త్వ పనితీరుపై జోరుగా చర్చ నడుస్తోంది. మరోవైపు రాజకీయ పార్టీలు పైచేయి సాధించాలని నాయకుల ఆ ధ్వర్యంలో సమీకరణాలు మొదలయ్యాయి. ఎలాంటి అభ్యర్థిని పెడితే బాగుంటుంది? ఇతర పార్టీల అభ్యర్థులను ఎదిరించాలంటే ఎలాంటి వ్యూహాలు రచించాల్సిన అవసరం ఉంది? అనే కోణంలో చర్చలు నడుస్తున్నాయి.

### కుటుంబ సభ్యుల ఓట్లన్నీ ఒకే స్టేషన్‌లో..

గతంలో ఎన్నికల్లో జరిగిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కుటుంబ సభ్యులందరు ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఓటు హక్కు వినియోగించుకొనేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఒక్కో పోలింగ్ స్టేషన్‌లో 650మంది ఓటర్లు ఉండనున్నారు. ఒకవేళ ఇంతకుమించితే అదనంగా పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తారు. అయితే హనుమకొండ జిల్లాలో అలా లేదని పంచాయతీరాజ్ అధికారులు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇప్పటికే పోలింగ్ స్టేషన్లను గుర్తించిన అధికారులు ఈ 7న 1,986 పోలింగ్ స్టేషన్లతో ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితాను ప్రకటించి 13వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించారు. అభ్యంతరాల పరిశీలన అనంతరం నేడు పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను వెల్లడించనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రింటింగ్ పేపర్లను ముంద్రించే పనిలో పంచాయతీరాజ్ అధికారులు నిమగ్నం అయ్యారు. ఇందుకు అవసరమైన వివరాలను ఇప్పటికే అధికారులు సేకరించారు. అభ్యర్థులను బట్టి బ్యాలెట్ పేపర్ సైజు ఉంటుందని పీఆర్ అధికారులు తెలిపారు.

**హనుమకొండ జిల్లాలో..** 14 మండలాలుండగా 12 మండలాల పరిధిలోని 210 గ్రామ పంచాయతీలకు, 1986 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం 3,70,932 మంది (పురుషులు 1,81,012 మంది, మహిళలు 1,89,918 మంది, ఇతరులు ఇద్దరు) ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. జనగామ జిల్లాలోని 12 మండలాల పరిధిలో 283 పంచాయతీలుండగా 2,576 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం 4,09,797మంది (పురుషులు 2,03,097, మహిళలు 2,06,696, ఇతరులు 4) ఓటర్లు ఉన్నారు.ఇందుకు సంబంధించిన ఓటరు జాబితాను పంచాయతీరాజ్ అధికారులు ఇప్పటికే ప్రకటించారు.

### షెడ్యూల్ ఎప్పుడొచ్చినా సిద్ధమే

గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ఏ క్షణంలో వచ్చినా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే వార్డుల వారీగా ఓటరు జాబితా సిద్ధం చేశాం. గతంలో జరిగిన పోరపాట్లకు తావులేకుండా కుటుంబ సభ్యులంతా ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఓటు హక్కు వినియోగించుకొనేలా జాగ్రత్తలు తీసుకున్నాం. అలాగే పోలింగ్ పర్సన్స్ వివరాలు సేకరించాం. ముసాయిదా పోలింగ్‌స్టేషన్ల జాబితాను ప్రకటించి అభ్యంతరాలు స్వీకరించాం. నేడు తుది పోలింగ్ స్టేషన్ల జాబితాను వెల్లడిస్తాం. అలాగే బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్ ప్రక్రియను ప్రారంభించాం.

– లక్ష్మీరమాకాంత్, హనుమకొండ జిల్లా పంచాయతీ అధికారి

# ముగిసిన గ్రూప్-2 పరీక్ష

ఉమ్మడి జిల్లాలో 50 శాతంలోపే హాజరైన అభ్యర్థులు

హనుమకొండ కేడీసీ వద్ద అభ్యర్థుల హాల్‌టికెట్లు పరిశీలించి పంపిస్తున్న సిబ్బంది

నమస్తే నెట్‌వర్క్ : ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా నిర్వహించిన గ్రూప్–2 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. రెండో రోజైన సోమవారం పరీక్షకు హాజరైన అభ్యర్థుల సంఖ్య 50 శాతం మించలేదు. హనుమకొండ జిల్లాలో 82 కేంద్రాల్లో 33,006 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా ఉదయం 16,025, మధ్యాహ్నం 16,044 మంది హాజరయ్యారు. వరంగల్ జిల్లాలో 28 కేంద్రాల్లో 11,310 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, ఉదయం, మధ్యాహ్నం 5,167 మంది హాజరయ్యారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని 17 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా, ఉదయం 4,423 అభ్యర్థులకు 2,099, మధ్యాహ్నం 2,097 మంది హాజరయ్యారు. జనగామ జిల్లాలో 16 కేంద్రాల్లో 5,470 మంది అభ్యర్థులకు పరీక్ష జరుగగా ఉదయం 2.893, మధ్యాహ్నం 2,891 మంది హాజరయ్యారు. మహబూబాబాద్ జిల్లాలోని 21 కేంద్రాల్లో 7,470 మంది అభ్యర్థులకు పరీక్ష నిర్వహించగా, ఉదయం 3,806, మధ్యాహ్నం 3,803 మంది హాజరయ్యారు. ములుగు జిల్లాలోని 9 కేంద్రాల్లో 2,195 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, ఉదయం 1,102, మధ్యాహ్నం 1,099 మంది హాజరయ్యారు. కాగా, పలు పరీక్షా కేంద్రాలను జయశంకర్ భూపాలపల్లి, ములుగు కలెక్టర్లు రాహుల్ శర్మ, టీఎస్ దివాకర తనిఖీ చేయగా, మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ సెంటర్ వద్ద సరళిని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి ఘటనలు జరుగుకుండా పోలీసులు 144 సెక్షన్ విధించి బందోబస్తు నిర్వహించారు.

## రెండు నిమిషాలు ఆలస్యం..

- సెంటర్‌లోకి అనుమతించని అధికారులు
- విలపిస్తూ వెనుదిరిగిన యువతి

గణపురం, డిసెంబర్ 16: గ్రూప్–2 పరీక్షకు మహిళా అభ్యర్థి రెండు నిమిషాలు ఆలస్యంగా రావడంతో అధికారులు సెంటర్‌లోకి అనుమతించలేదు. వివరాల్లోకి వెళ్తే.. భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్–2 పరీక్ష కేంద్రానికి రెండోరోజు సోమవారం భూపాలపల్లి పట్టణానికి చెందిన ఓ యువతి రెండు నిమిషాలు ఆలస్యంగా వచ్చింది. దీంతో అధికారులు ఎగ్జామ్ సెంటర్‌లోకి అనుమతించలేదు. 'తాను అనారోగ్యంతో ఉన్నానని, దవాఖానకు వెళ్లి వచ్చానని, పరీక్ష రాసేందుకు అనుమతించాలని అధికారులను ప్రాధేయపడినా కనికరం చూపలేదు. దీంతో ఆ యువతి చేసేదేమీ లేక విలపిస్తూ వెనుదిరిగి వెళ్లిపోయింది.

అధికారులు అనుమతించకపోవడంతో వెనుదిరిగి వెళ్లిపోతున్న యువతి

# మంత్రి సీతక్కవన్నీ అబద్ధాలే

- తప్పుడు ప్రకటనలు చేయడం మంత్రికి తగదు
- వందల కోట్ల నిధులను రద్దు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ఎమ్మెల్యేలు, అధికార పార్టీ కాంట్రాక్టర్లకు ప్రత్యేక వాటాలు
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, డిసెంబర్16 : నిండు అసెంబ్లీలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) చెప్పిన వన్నీ అబద్ధాలు, అసత్యాలేనని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంచాయతీ రాజ్, రోడ్ల నిర్మాణాలపై మంత్రి సీతక్క అసెంబ్లీలో చేసిన ప్రకటనను ఆయన తీవ్రంగా ఖండించారు. మంత్రి సీతక్క నర్సంపేట నియోజకవర్గానికి పక్కనే ఉన్న ములుగు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారని, ఇలాంటి తప్పుడు ప్రకటనలు చేయడం సరికాదన్నారు. కొత్తగా రోడ్ల నిర్మాణం చేయడానికి సంబంధించిన అన్ని నిధులను విడుదల చేశామని, ప్రతి గ్రామ పంచాయతీతో పాటు గ్రామాలు, తండాల్లో కొత్తగా రోడ్ల నిర్మాణం చేస్తున్నామని మంత్రి ప్రకటనలు చేయడం విడ్డూరమన్నారు. నర్సంపేట నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో మంజూరు చేసిన రూ. కోట్లాది నిధులను రద్దు చేశారన్నారు. ఇలాంటి తప్పుడు ప్రకటనలు చేయడం శోచనీయమన్నారు. పక్క నియోజకవర్గం ములుగులో ఉండి ఒక్కనాడైనా నర్సంపేటకు వచ్చి సమీక్ష చేస్తే కదా మీకు తెలిసేది అని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో తండాలు, గ్రామాలు, పల్లెలకు ఇచ్చిన బీటీ, సీసీ రోడ్లతో పాటు మహిళా భవనాలు, అనేక రకాల అభివృద్ధి నిధులు గత ప్రభుత్వంలోనే మంజూరయ్యాయన్నారు. అనేక రాష్ట్ర స్థాయి విద్యా సంస్థలు, రీసెర్చ్ సెంటర్లు ఎక్కడివి అక్కడే మూలుగుతున్నాయన్నారు. మంత్రి సీతక్క అసెంబ్లీలో మాట్లాడిన మాటలకు, నర్సంపేట నియోజకవర్గంలో జరిగే పరిస్థితులకు సంబంధం లేదన్నారు. ప్రభుత్వంపై పట్టులేదని, సొంత, నర్సంపేట నియోజకవర్గంలో సమీక్ష నిర్వహించే పరిస్థితి లేదన్నారు. మంత్రి సీతక్క నర్సంపేట అభివృద్ధిపై సమీక్ష ఎందుకు నిర్వహించలేదని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు, అధికార పార్టీ కాంట్రాక్టర్లకు వాటాలున్న ఏజెన్సీలో పనిచేస్తే 2 నెలలకే బిల్లులు వస్తాయని, గత ప్రభుత్వంలో పనులు చేసి ఏడాది దాటినా బిల్లులు రాకపోవడం బాధాకరమన్నారు. బిల్లులు ఆపి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పెద్ది విమర్శించారు. రాష్ట్రంలో 10 శాతం వసూలు లేకుండా కాంట్రాక్టర్లకు బిల్లులు లేవన్నారు. బిల్లుల కోసం 10 శాతం కమీషన్ వసూలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై అసెంబ్లీలో ఎందుకు మాట్లాడరని, ప్రభుత్వానికి కప్పం కడితే 2 నెలల్లోనే బిల్లులు ఎలా వచ్చాయని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ మార్పు వల్ల అభివృద్ధి ఆగిపోయిందని, కొత్త నిధులు అడిగే వారు ఎవరూ లేరన్నారు. నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందని, తక్షణమే మంత్రి సీతక్క ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పెద్ది కోరారు.

# శివుని చెంత నాగరాజు

గార్లలో పార్వతీ పరమేశ్వరుడి చిత్రపటం వద్ద ప్రత్యక్షమైన నాగుపాము

గార్ల, డిసెంబర్ 16 : శివుని ఆశీర్వాదం పొంది అభరణంగా మారిన 'నాగరాజు'ను మనం దేవుడి పటంలోనే చూస్తుంటాం. కానీ ఇక్కడో నాగుపాము ఏకంగా పార్వతీ పరమేశ్వరుడి ఫొటో పక్కనే పడగ విప్పి కనిపించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ దృశ్యం మహబూబాబాద్ జిల్లా గార్లలో కొబ్బరిబొండాల వ్యాపారం చేసే చెవుల కుమారస్వామి ఇంటి పూజ గదిలో అది కూడా సోమవారం రోజునే ప్రత్యక్షమై మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 5వరకు 'శివుడి' వద్దే ఉండ డంతో స్థానికులు తరలివచ్చి పూజలు చేశారు.

## రేపు జాబ్ మేళా

పోచమ్మమైదాన్, డిసెంబర్ 16: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఈ నెల 18న నిర్మాణ్ ఆర్గనైజేషన్ (ఇన్‌ఫోసిస్ సపోర్టు) హనుమకొండ కంపెనీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు రోడ్డులోని బాలుర ఐటీఐ ప్రాంగణంలో జాబ్ మేళా సెక్టార్లో ట్రైనింగ్ కమ్ ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. అభ్యర్థులు పీజీ, డిగ్రీ, బీటెక్, ఫార్మా, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై 18 నుంచి 28 ఏళ్ల వయసు ఉండాలన్నారు. ఎంపికైన వారు వరంగల్, హైదరాబాద్ ప్రాంతంలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

# నేషనల్ సిల్క్ ఎక్స్‌పో షురూ..

కస్టమర్లకు చీరెలు చూపిస్తున్న ఎక్స్‌పో నిర్వాహకులు

హనుమకొండ, డిసెంబర్ 16: హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభమైంది. ఈ ప్రదర్శన ఈ నెల 19వ తేదీ వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. వివాహ, పొంగల్ ప్రత్యేకమన్నారు. దేశమంతటి నుంచి ధ్రువీకృతమైన 150పైగా వీవర్స్‌తో అసలైన పట్టు, కాటన్ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం ఉందన్నారు. స్వచ్ఛమైన పట్టును విశ్వసించేందుకు టెస్టింగ్ సౌకర్యం అందుబాటులో ఉందని తెలిపారు. ఇందులో పట్టు కాటన్ చీరెలు, డిజైనర్, సంప్రదాయ దుస్తులు, కుర్తి, ఫ్యాషన్ జ్యువెల్లరీ, హోమ్ లెనిన్ లాంటి మరెన్నో చేనేత వస్త్రాలు ప్రదర్శిస్తున్నామని తెలిపారు. జిల్లాతో పాటు త్రినగరిలోని ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

## జ్వరంతో బాలుడి మృతి

మేఘనాథ్ (ఫైల్)

వాజేడు, డిసెంబర్16: జ్వరంతో బాలుడు మృతి చెందిన ఘటన ములుగు జిల్లా వాజేడు మండలంలోని జగన్నాథపురంలో సోమవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొప్పుల ప్రశాంత్ కుమారుడు మానస మేఘనాథ్(3)కు నాలుగురోజుల క్రితం జ్వరం, జలుబు రావడంతో స్థానిక వైద్యుడి వద్ద చికిత్స అందించారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో ఆదివారం భద్రాచలంలోని ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు సిబ్బంది తెలుపడంతో స్వగ్రామానికి తీసుకొచ్చారు. కాగా, సోమవారం శరీరంలో కొంత కదలిక ఉన్నట్లు గుర్తించిన కుటుంబ సభ్యులు ఏటూరునాగారం వైద్యశాలకు తీసుకెళ్లగా, పరీక్షించిన వైద్యులు బాలుడు మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయంపై వాజేడు వైద్యాధికారి మధుకర్‌ను వివరణ కోరగా.. బాలుడు మృతి చెందినట్లు తెలిసిందని, వైద్యం కోసం ఇక్కడి పీహెచ్‌సీకి తీసుకురాలేదని తెలిపారు.

## గిరిజన పాఠశాలలో విద్యార్థుల ఘర్షణ!

దామెర, డిసెంబర్ 16: దామెర క్రాస్ రోడ్డులోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఆదివారం తొమ్మిదో తరగతి విద్యార్థి, 6వ తరగతి విద్యార్థి పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ చొక్కా, నిక్కరు విడిపించేందుకు యత్నించడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగి ఒకరిపై ఒకరు చేయిచేసుకున్నారు. విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్.. తొమ్మిదో తరగతి విద్యార్థిని మందలించినట్లు తెలిసింది. సీనియర్ విద్యార్థి జూనియర్‌ను ర్యాగింగ్‌కు ప్రయత్నించడం చర్చనీయాంశమైంది. కాగా ఇద్దరి మధ్య కొంతకాలంగా మనస్పర్థలున్నట్లు సమాచారం.

## జూపార్కుకు శివ-అనిత

రెండు అడవి దున్నల రాక

సుబేదారి, డిసెంబర్ 15 : హనుమకొండ హంటర్‌రోడ్డులోని కాకతీయ జూపార్కుకు రెండు అడవి దున్నలు వచ్చాయి. జిల్లా అటవీ శాఖ అధికారులు హైదరాబాద్‌లోని నెహ్రూ జూపార్కు నుంచి సోమవారం